

'గుమ్మనూరు'కు గుంతకల్లు దక్కేనా ?

ఇప్పటికీ ఖరారుకాని అభ్యర్థిత్వం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



తాజా మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం ఎక్కడి నుంచి బరిలో దిగనున్నారన్న దానిపై చర్చ నడుస్తోంది. వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయనకు ఆ పార్టీ ఎక్కడి నుంచి బరిలో దింపనుందన్నది ఆసక్తికరంగా మారింది. ఆయన సొంత నియోజకవర్గం ఆలూరా లేక గుంతకల్లునా అన్నది చర్చ నడుస్తోంది. జయరాం రాజకీయ ప్రస్థానం ఆలూరు నుంచే మొదలైంది. అయితే ఇటీవల పార్టీ మారిన నేపథ్యంలో అంతకు ముందు నుంచి ఆలూరులోనున్న టిడిపి నాయకులకు అక్కడ అవకాశం కల్పిస్తూ ఇటు గుంతకల్లుకు జయరాంను తీసుకురానున్నారన్న వాదనలు వినిపిస్తూ వచ్చాయి. అందుకు అనుగుణంగా జయరాం సోదరులు సైతం గుంతకల్లు నియోజకవర్గంలో పర్యటించి ముఖ్య నేతలతోనూ సమావేశాలు నిర్వహించారు. అయితే స్థానిక గుంతకల్లు తెలుగుదేశం ముఖ్య నాయకులు మాత్రం పక్క జిల్లా నుంచి తీసుకొచ్చి ఇక్కడ టిక్కెట్టు ఇవ్వడాన్ని అంగీకరించడం లేదు. వరుసగా నిరసనలు, ఆందోళనలు కొనసాగిస్తూ ఉన్నారు. బోయ సామాజిక తరగతి ఎక్కువగానున్న గుంతకల్లులో బోయ సామాజిక తరగతికి చెందిన జయరాంను నిలుపడం ద్వారా ప్రయోజనముంటుందని పార్టీ భావిస్తున్నట్టు కొంత మంది నేతలు చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకు నియోజకవర్గంలో బాధ్యతలు చూస్తూ వచ్చిన ముఖ్య నేతలు కూడా ఇక్కడ బిసి సామాజిక తరగతికి చెందిన వారేనని చెబుతున్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి జితేందర్ గౌడ్ బిసినే. ఆయన సోదరుడు సాయినాథ్ గౌడ్ కాలం నుంచి కూడా ఆ కుటుంబం టిడిపిలోనే ఉండి పనిచేస్తూ వస్తోంది. సాయినాథ్ గౌడ్ మరణం తరువాత జితేందర్‌గౌడ్ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఈయనతో పాటు కెసి నారాయణ కుటుంబ సభ్యులు టిక్కెట్టు ఆశిస్తున్న వారిలోనున్నారు. వీరిని కాదని పక్క జిల్లాలో అది కూడా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని వెంటనే ఇక్కడికి తీసుకొచ్చి టిక్కెట్టు ఇవ్వడాన్ని స్థానిక నాయకులు కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థిత్వ ఖరారులోనూ జాప్యం జరుగుతూ వస్తోంది. సమస్యాత్మకంగానున్న ప్రాంతాల్లో పెండింగులో ఉంచారు. ఈ రకంగా పెండింగులోనున్న వాటిల్లో అనంతపురం, గుంతకల్లు మాత్రమే జిల్లాలో ఉన్నాయి. గుంతకల్లు టిక్కెట్టు జయరాంకు ఇస్తే సహకరించబోమని స్థానిక నాయకులు చెబుతున్నారు. ఈ అసంతృప్తులను ఏ రకంగా చల్లారుస్తారన్నది చూడాల్సి ఉంది. ఒకవేళ ఇక్కడ కుదరకపోతే కర్నూలు జిల్లాలోని ఆయన సొంత నియోజకవర్గమైన ఆలూరుకే తిరిగి పంపించే అవకాశాలూ లేకపోలేదన్న చర్చ నడుస్తోంది. తిరిగి ఆయన్ను పాత స్థానానికే పంపి ఇక్కడ స్థానిక నాయకులకే అవకాశం కల్పిస్తారా అన్నది చూడాల్సి ఉంటుంది. మొత్తంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో గుంతకల్లు నియోజకవర్గం హాట్‌టాపిక్‌గానూ మారింది. ఈ సీటు అభ్యర్థిత్వాన్ని త్వరలోనే తేలుస్తారా లేక మరికొంత సమయం పెండింగులో ఉంచుతారా అన్నది చూడాల్సి ఉంది.

'అనంత'లో ఆకలి చావు

- నాలుగేళ్లుగా విగ్రహం నీడనే జీవనం
- దయనీయస్థితిలో గర్భిణి మృతి
- కలెక్టరేట్ ఎదుటే ఘటన

యువత బంగారు భవిష్యత్తుకోసం ఓ వైపు ప్రభుత్వ యంత్రాంగం విద్య ఆవశ్యకత, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నా నేటి యువత తమ జీవితాలను చేజేతులా నాశనం చేసుకుంటోంది. చదువుకోవాల్సిన వయస్సులో ప్రేమ వ్యామోహంలో పడి భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు. తెలిసీ తెలియని వయసులో భవిష్యత్తుపై సరైన అవగాహన లేక తమ జీవితాలను అర్థాంతరంగా ముగించుకుంటున్నారు. ఇందుకు ఆదివారం అనంతపురం నగరంలో సాక్ష్యాత్తు కలెక్టర్ కార్యాలయం ఎదుట చోటు చేసుకున్న హృదయ విదాకర సంఘటనే సజీవ సాక్ష్యం.

ప్రజాశక్తి - అనంతపురం సిటీ

అనంతపురం నగరంలోని టీవీ టవర్ వద్ద నివసించే ఓ దళిత కుటుంబానికి చెందిన అంజలి అనే యువతి తన 14 సంవత్సరాల వయస్సులో బిసి సామాజికవర్గానికి చెందిన రాజు అనే యువకుడిని ప్రేమించింది. మైనార్టీ కూడా తీరని అంజలి పెద్దలను ఎదిరించి రాజును పెళ్లి చేసుకుంది. కొన్ని రోజులు వారి జీవనం సజావుగా సాగింది. వారికి ముగ్గురు సంతానం కలిగారు. ఈ నేపథ్యంలో రాజు తాగుడుకు బానిస అయ్యాడు. భార్య, పిల్లలను పట్టించుకోవటం మానివేశాడు. దీంతో వారి జీవనం కష్టంగా మారింది. ఆకుటుంబం నివసించడానికి నీడ కూడా కరువైంది. దీంతో కలెక్టర్ కార్యాలయం ఎదుట చెరువు కట్ట మీదకు వెళ్లే దారిలో ఉండే ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం కింద నాలుగు సంవత్సరాలుగా ఆ కుటుంబం జీవనం సాగిస్తోంది. ముగ్గురు పిల్లలను ప్రతి రోజూ దేవాలయాల వద్ద కూర్చొబెట్టి వచ్చిన డబ్బుతో రాజు మద్యం సేవించేవాడు. కొద్దో గొప్పో మిగిలిన డబ్బుతో ఏదైనా తిండి తెచ్చుకుని తినేవారు. ప్రస్తుతం అంజలి నాలుగు నెలల గర్భిణి. ఆమెకు కనీస పోషకాహారం లేకపోవటంతో బలహీనంగా మారింది. ఈ నేపథ్యంలో అంజలి శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్ ఎదుట రోడ్డు దాటుతున్న సమయంలో ఆమెను ద్విచక్రవాహనం ఢీకొంది. అయితే ఈ ప్రమాదంలో అంజలి కిందికి పడినా తిరిగి పైకి లేచి నడుచుకుంటూ విగ్రహం వద్దకు వెళ్లింది. రాత్రి 2 గంటల సమయంలో అంజలి తన భర్త రాజును నిద్రలేపి తనకు ఆకలిగా ఉందని చెప్పింది. అయినా అతను పట్టించుకోలేదు. ఆకలితో అలమటించిన అంజలి(29) తెల్లవారుజామున 5 గంటల సమయంలో మృతిచెందింది. ఉదయం గమనించిన అక్కడున్న వారు మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సాయిట్రస్ట్ అధ్యక్షులు విజయసాయి కుమార్, ట్రస్టు సభ్యులు తదితరులు అక్కడి వెళ్లారు. పోలీసులకు సమాచారం అందించి తహశీల్దార్ అనుమతితో ఒక ప్రత్యేక వాహనంలో జెఎన్‌టియు రోడ్‌లోని వైకుంఠఘాట్‌లో అంజలికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

కనీస సాయం కరువు : నాలుగు సంవత్సరాలుగా అనాథ కుటుంబం సాక్ష్యాత్తు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న ఫెర్రర్ విగ్రహం వద్ద నివసిస్తోంది. వారికి ప్రభుత్వం నుంచి అందే కనీస సాయం కూడా కరువైంది. పిల్లలతో భిక్షమెత్తించి వచ్చిన డబ్బుతో రాజు మద్యం తాగేవాడు. అడుక్కుని జీవించే ఆ కుటుంబానికి కనీస గుర్తింపు కార్డు కూడా లేదు. కనీసం వారి కుటుంబానికి బియ్యం కార్డు ఉన్నా అంజలి ఆకలి మరణం జరిగేది కాదు. కేవలం రాజుకు మాత్రమే ఆధార్ కార్డు ఉంది. అంజలికి, వారి ముగ్గురు పిల్లలకు ఆధార్‌కార్డు కూడా లేదు. దీని వల్ల ఆ కుటుంబానికి ఎలాంటి సంక్షేమం అందలేదని తెలుస్తోంది.



ఫాదర్‌ఫెర్రర్ విగ్రహం కింద అంజలి మృతదేహం వద్ద సాయిట్రస్టు సభ్యులు

తాగుడుకు బానిసైన రాజు ఆ పిల్లలను ఏమైనా చేస్తాడని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆ పిల్లలకు హాస్టల్లో ఆశ్రయం కల్పించి వారి భవిష్యత్తుకు బాట వేయాలని మానవతావాదులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

పోలీస్‌స్టేషన్ ముందు మృతదేహంతో బైఠాయింపు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఇన్నోవా కారులో కూర్చున్న వ్యక్తి ఉన్నఫళంగా డోర్ తీయడంతో బైక్‌పై వస్తున్న లెక్కల దామోదర్‌నాయుడుకు తగలడంతో కిందపడి తీవ్రంగా గాయపడి శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడి కుంటుంబ సభ్యులు, బంధువులు ఆదివారం శవంతో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. గతంలో తల్లి, ఇప్పుడు తండ్రి ఇలా మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారన్నారు. దామోదర్‌నాయుడు మృతికి కారణమైన ఇన్నోవా కారు యజమానిపై తగిన చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి రూ. 25 లక్షలు పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. పోలీసులు సర్ది చెప్పినా ఫలితం లేకపోయింది. వారు మధ్యాహ్నం 1 గంట వరకూ ఆందోళన కొనసాగించారు. వీరి ఆందోళనకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సంఘీభావం తెలిపారు. బాధిత కుటుంబానికి రూ. లక్ష అందజేశారు. డీఎస్పీ వాసుదేవన్‌తో సమస్యపై చర్చించారు. ఎస్పీ మాధవరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. విచారణ జరిపి న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వారు శవాన్ని అక్కడి నుంచి తరలించారు. కార్యక్రమంలో సిఐలు బాలసుబ్రమణ్యం రెడ్డి, రామయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారి కిడ్నాప్

పోలీసుల అదుపులో నిందితులు

గంటల వ్యవధిలోనే కేసు ఛేదింపు

ప్రజాశక్తి - కొత్తచెరువు



చికెన్ సెంటర్ వ్యాపారి చలపతి

శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువుకు చెందిన చికెన్‌సెంటర్ వ్యాపారి ఆదివారం తెల్లవారుజామున కిడ్నాప్‌కు గురయ్యాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో అప్రమత్తమైన పోలీసులు నిందితులను గంటల వ్యవధిలోని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబందించి పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు... కొత్తచెరువుకు చెందిన చెకెన్‌సెంటర్ వ్యాపారి ఉప్పు చలపతి ఆదివారం తెల్లవారుజామున తన ఇంటివద్దనుంచి చికెన్ సెంటర్ వద్దకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. ఇంటిబయటకు వచ్చిన ఆయనను రెండు కార్లు వచ్చిన 8 మంది బలవంతంగా కారులో తీసుకొని బుక్కపట్నం వైపునకు వెళ్లారు. ఇది గమనించిన పరిసర ప్రాంతాల ప్రజలు గట్టిగా కేకలు వేశారు. దీంతో చలపతి భార్య, కుటుంబ సభ్యులు బయటకు వచ్చి విషయం తెలుసుకుని వెంటనే కొత్తచెరువు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కొత్తచెరువు పోలీసులు ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు పరిశీలించారు. కారు బుక్కపట్నం వైపు వెళ్లినట్లు గుర్తించి వెంటనే బుక్కపట్నం, ముదిగుబ్బ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆయా పోలీస్‌స్టేషన్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ముద్దుగుబ్బలో పోలీసులు అటువైపు వస్తున్న కారును గమనించారు. కారును ఆపి అందులో ఉన్న ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో కారులో ఉన్న ముగ్గురు నిందితులు కారుతో సహా పరారయ్యారు. అయితే చలపతి ఉన్న కారును పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో కిడ్నాప్‌కు గురైన చలపతితో పోలీసులు మాట్లాడి వివరాలు సేకరించారు. నిందితుడిలో ఒకరు చలపతికి స్వయాన బావమరదిగా గుర్తించారు. గతంలో చలపతిని ఆయన బావమరది అధిక మొత్తంలో డబ్బులు ఇవ్వాలని అడిగాడని అందుకు చలపతి నిరాకరించడంతో ఈ కిడ్నాప్‌కు ప్రయత్నించాడని చలపతి కుటుంబసభ్యులు తెలిపారు. మరొక కారులో ముగ్గురు వ్యక్తులు పరారు అయ్యారని వారికోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని సిఐ రాజా రమేష్ తెలిపారు.

ముస్లిములకు ఆశ్ పంపిణీ

ప్రజాశక్తి-హిందూపురం

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్ష ఆచరించే వారి కోసం పట్టణంలోని ధర్మపురం నూరాని మసీదు వద్ద రంజాన్ మొదటి రోజు నుంచి ఆశ్‌ను సిద్ధం చేసి పంపిణీ చేస్తున్నారు. నిర్వాహకులు, మసీదు ముతవల్లి అల్ హాజ్ క్వాలిటీ నాసీర్ సాహెబ్ మాట్లాడుతూ ఆశ్ అనేది తమిళనాడుకు చెందిన వంటకం అన్నారు. ఈ వంటకం శరీరంలో ఉష్ణోగ్రతను తగ్గిస్తుందన్నారు. ప్రతి రోజూ ధర్మపురంతో పాటు పట్టణ వ్యాప్తంగా వందలాది మంది తీసుకెళ్తున్నారన్నారు. ప్రతి రోజూ మసీదు వద్ద ఉపవాస దీక్షను ఆచరించే వారికీ తెల్లవారు జామున భోజనం సౌకర్యం(సెహరి)కల్పించామన్నారు. ఇందుకు మసీదు యువజన కమిటీ సహకారం అందిస్తున్నారన్నారు. రంజాన్ మాసం పూర్తయ్యే వరకూ ప్రతి రోజూ సాయంత్రం ఆశ్‌ను సిద్ధం చేసి 5 గంటల నుంచి పంపిణీ చేస్తామన్నారు. తెల్లవారుజామున భోజనం సిద్ధంగా ఉంటుందని, ఎవరైనా వచ్చి సెహరి చేసుకుని, వారి ఉపవాస దీక్షలను ఆచరించ వచ్చు అన్నారు.

గ్రామాల్లో సాయుధ దళాల కవాతు

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని గజ్జలవాండ్లపల్లి, గరుగుతండా, తుమ్మలబయలు, పెద్దతండా, తదితర గ్రామాల్లో ఆదివారం ఎస్ఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో సాయుధ దళాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో ధైర్యం నింపేందుకు బిఎస్ఎఫ్, ఆర్మీ, సాయుధ దళాలు గ్రామాల్లో కవాతు నిర్వహించాయన్నారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామాల్లో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తామని తెలిపారు. కవాతులో జమేదారులు రామయ్య, తిరుమలరెడ్డి, భాస్కర్, రాజు, బాలాజీ నాయక్, బిఎస్ఎఫ్ పోలీసులు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ నూనెలతో పొంచి ఉన్న ప్రమాదం

పండుగల వేళ యథేచ్ఛగా అమ్మకాలు

ప్రజల ప్రాణాలతో చెలగాటం

నిద్రమత్తులో ఆహార భద్రత అధికారులు..?



అపరిశుభ్రంగా ఉన్న అండర్ గ్రౌండ్ ట్యాంక్ ప్రదేశం

ఏం తింటున్నాం, ఎంత తింటున్నాం ఈ రెండు విషయాల చుట్టూనే ఇప్పుడు మనిషి జీవితం నడుస్తోంది. ఆరోగ్యకరమైనదే తింటున్నామా..? ఏది తింటే మంచిది..? ఇంత కంటే మంచివి ఇంకేం తినొచ్చు..? ఇట్లాంటి ప్రశ్నలే బుర్ర నిండా తిరుగుతుంటాయి. డాక్టర్లు కూడా మందుల కంటే ఎక్కువగా తిండి విషయంలోనే దృష్టిపెట్టాలని జనాలకు సలహాలు ఇస్తున్నారు. ఇటీవల వంటనూనెల్లో కల్తీ అనే మాట ప్రతినోట వినిపిస్తోంది. వాటిని ఆరగిస్తే ఆవంటనూనె మంటలో ఆరోగ్యం కలిసిపోవడం ఖాయం. ఈ మధ్యకాలంలో అధిక ధర ఉండే వంటనూనెతో చౌకరకాల నూనె కలపడం లేదా పశువుల కొమ్ములు, ఎముకలు కరిగించి తీసిన నూనెను సాధారణ నూనెలో కలపడం జరుగుతోంది. దీంతో ఆహార భద్రత దృష్ట్యా ప్రభుత్వాలు చట్టాలను కఠిన తరం చేసినప్పటికి కొంత మంది నూనె వ్యాపారులు వారి స్వార్థం కోసం నిబంధనలు అతిక్రమించి కనీసం ట్యాంకర్లను కూడా శుభ్రం చేయకుండానే దర్జాగా లూజు విక్రయాలను జరుపుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆహార భద్రత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.



దుకాణంలో లూజు నూనెను విక్రయిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

పండుగల వేళ కల్తీ నూనెలు యథేచ్ఛగా మార్కెట్లోకి వచ్చేస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కల్తీ నూనె వ్యాపారం జోరుగా సాగుతోంది. జీఎస్టీ లేకుండానే జీరో దందా నడుస్తోంది. హిందూపురం పట్టణంలో భారత్ అయిల్ డిపో, బాలాజీ ట్రేడర్స్ పేరుతో రోజుకు వేలాది లీటర్ల వంటనూనె లూజు విక్రయాలు జరుగుతున్నాయి. ఏకంగా ప్రత్యేక ట్యాంకర్లలను ఏర్పాటు చేసుకుని ఇతర ప్రాంతాల నుంచి వారు దిగుమతి చేసుకుంటున్నారు. నూనెల లూజ్ విక్రయాలపై నిషేధం ఉన్నా అమ్మకాలు సాగుతూనే ఉన్నాయి. లూజు విక్రయాలపై ఆహార భద్రత అధికారులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించాల్సి ఉన్నప్పటికి అలాంటి దాడులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడ పూర్తి స్థాయిలో జరపక పోవడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోట్ల రూపాయల్లో కల్తీ వ్యాపారం సాగుతున్నా నియంత్రించే వారు లేకపోవడంతో పండుగ సమయాల్లో కల్తీనూనె, కల్తీ నెయ్యి విక్రయాలతో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. డాల్డాలో కృత్రిమ రంగులు కలిపి నెయ్యిగా మారుస్తున్నారు. పసుపు పచ్చ పత్తినూనెతో పల్లినూనె కల్తీ చేస్తున్నారు. తెల్లపత్తి నూనెను పొద్దుతిరుగుడు అయిల్‌లో కలుపుతారనే ఆరోపణలు ఉన్నాయి. కల్తీనూనెకు తోడు నాసిరకం పప్పులు, మసాలా దినుసుల పొడులను ప్రజలకు అంటగడుతున్నట్లు తెలుస్తోంది. వినియోగదారులు తాము కొనుగోలు చేస్తున్న నూనె ఎంత స్వచ్ఛమైనదో ఒకటికి రెండుసార్లు పరిశీలించాలి. వంట నూనెలను ప్లాంట్ నుంచి వ్యాపారులకు రవాణా చేసే ట్యాంకర్లను, వ్యాపారులు వారు స్టాకు చేసుకునే ట్యాంకర్లను పరిశీలిస్తే కల్తీ నూనెల బండారం బయటపడే అవకాశాలు ఉన్నాయి. వంట నూనెలు విచ్చలవిడిగా కల్తీ అవుతున్నాయి. కొన్నింటిలో ఏమాత్రం క్వాలిటీ ఉండటం లేదు. మరికొన్నింటిని వాడటం ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. కల్తీ వంట నూనెల్లో విషపూరితమైన ఆఫ్లాటాక్సిన్ లు, ఆరోగ్యానికి హాని చేసే హెవీ మెటల్స్ ఉంటున్నట్లు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) నిర్వహించిన పరీక్షల్లో తేలింది. వంట నూనెల్లో పల్లి నూనె అత్యధికంగా కల్తీ అవుతోంది. ఆ తర్వాత స్థానాలలో సోయాబీన్, రైస్ బ్రాన్, నువ్వుల నూనె, కొబ్బరి నూనె ఉన్నాయి. వంట నూనెల్లో ఎ, డి విటమిన్లు కూడా ఉండాల్సిన స్థాయిలో లేవని వెల్లడైంది. వంట నూనెను ప్యాకెట్లుగా తయారు చేస్తున్న అక్రమార్కులు ఆ ప్యాకెట్లపై ఎలాంటి వివరాలు ఉంచడం లేదు.

లూజ్ ఆయిల్ మరింత డేంజర్..

గత రెండు సంవత్సరాల క్రితం భారత ప్రభుత్వం ఎఫ్ఎస్ఎస్ఎఐ పలు ప్రాంతాలలో వంట నూనెల శాంపిల్స్ సేకరించింది. 4,461 శాంపిల్స్‌లను పరీక్షించి వాటిలో క్వాలిటీ, కల్తీ, సేఫ్టీ ఏమేరకు ఉందనే దానిపై ఒక రిపోర్డును విడుదల చేసింది. ఎడిబుల్ ఆయిల్స్ సేఫ్టీపై అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలను అలర్ట్ చేసింది. మొత్తం టెస్ట్ చేసిన శాంపిల్స్‌లలో 118 శాంపిల్స్ అస్సలు సేఫ్ కాదని తెలిపింది. ఇలాంటి వాటిని జనాలు కొంతకాలం పాటు తింటే అనారోగ్యానికి గురవుతారని హెచ్చరించింది.

కల్తీపై చర్యలు శూన్యం

జిల్లాలో ప్రధాన పట్టణాలతో పాటు వివిధ మండలాల్లో కల్తీ సరుకుల అమ్మకాలకు అనేక పద్ధతులు ఉపయోగిస్తున్నారు. నూనెల్లో ఆముదం, ఖనిజ తైలం, జంతువుల కొవ్వును కరిగించి కల్తీ చేయడం, సోయాబీన్, పత్తిగింజలు, పామోలిన్ వంటి నూనెలను కల్తీ చేయడం లాంటివి చేస్తున్నారు. నెయ్యిలో కృతిమ రంగులు కలుపుతున్నారు విచ్చల విడిగా ఆహార పదార్థాలు తయారు చేస్తున్నా నియంత్రించిన దాఖలాలు లేవు.

నిద్ర మత్తులో ఆహార భద్రత అధికారులు....?

కల్తీ వంట నూనెతో పాటు కల్తీ ఆహారంపై ఎప్పటికప్పుడు తనఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాల్సిన ఆహార భద్రత అధికారులు వ్యాపారులు నిద్ర మత్తులో ఉన్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. నెలలో ఒక్క సారి కూడా తనిఖీలు చేపట్టిన దాఖలాలు లేవు. తనఖీకి వచ్చినా వారు పెద్ద పెద్ద వ్యాపారుల జోలీకి వెళ్లరు. చిన్న చిన్న వ్యాపారుల వద్దకు వెళ్లి తనఖీలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారన్నా ఆరోపణలు వినపిస్తున్నాయి. ఇప్పటికైన మత్తును వీడి తనికీలు నిర్వహించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుని, ప్రజారోగ్యాన్ని కాపాల్సిన అవసరం ఉంది.



ట్యాంకర్ నుంచి అన్ లోడ్ చేస్తున్న వంట నూనె

ఎపిని మాదక ద్రవ్యాల కేంద్రంగా మార్చిన వైసిపి

వైసిపి సమన్వయకర్తకు సెక్యూరిటీపై కోర్టుకెళ్తాం : కందికుంట


విలేకరులతో మాట్లాడుతున్న కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

సిఎం జగన్ రాష్ట్రాన్ని మాదక ద్రవ్యాలకు కేంద్ర బిందువుగా మార్చేశారని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ ఆరోపించారు. కందికుంట ఆదివారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని యువతను డ్రగ్స్, గంజాయి, కొకైన్, తది తర మత్తు పదార్థాలకు బానిసగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరభద్రరావు కంపెనీలో రూ. 25 వేల కోట్ల విలువైన నార్కోటిక్ మత్తు పదార్థాలు పట్టుబడగా సిబిఐ అధికారులు తనిఖీలు చేస్తుండగా స్థానిక అధికారులు, పోలీసులు అడ్డుకో వడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఇందులో ప్రభుత్వంలోని కొందరి పెద్దల హస్తం ఉందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా మూలాలు ఎపి వైపు చూపించే దుస్థితి తీసుకొచ్చారని మండిపడ్డారు. ప్రజా కోర్టులో జగన్ అండ్ కో బృందానికి శిక్ష తప్పదన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోని పక్షంలో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. కదిరి వైసీపీ సమన్వయకర్తకు పర్సనల్ సెక్యూరిటీని ఎందుకు తొలగించలేదని పోలీస్ అధికారులను ప్రశ్నించారు. ఈ విషయంపై కోర్టుకు వెళ్తామన్నారు. ఆయనతో పాటు నాయకులు చెన్నకేశవులు, వీరశంకర్, మోపూరుశెట్టి చంద్రశేఖర, శంకర్, నాగప్ప ఉన్నారు

'గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా' : సవితమ్మ


వికలాంగుడిని ఓటు అభ్యర్థిస్తున్న సవితమ్మ

ప్రజాశక్తి-పరిగి

రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే పెనుకొండ నియోజకవర్గంలో అభివృద్ధి చేసి చూపిస్తానని టిడిపి అభ్యర్థి సవితమ్మ ఓటర్లను కోరారు. ఆమె ఆదివారం మండలంలోని బీచిగానిపల్లి, సిగుపల్లి, విట్టాపల్లి పంచాయతీల్లో ప్రచారం చేపట్టారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీమేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనలో మండలంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. గతంలో టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధే ఇప్పటికీ కనిపిస్తుందన్నారు. గ్రామాల్లో డ్రెయినేజీ, రోడ్డు సమస్యలను పూర్తిగా పరిష్కరించిన ఘనత టిడిపిదే అన్నారు. అభివృద్ధి చేసే నాయకులను ప్రజలు గుర్తించి ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. తాను లోకల్ అని, ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. నాన్ లోకల్ అభ్యర్థులను గెలిపిస్తే మీ సమస్య ఎలా పరిష్కారం అవుతుందన్నారు. ఆమె వెంట బీచిగానిపల్లి సర్పంచి బాలాజీ, సూర్యనారాయణ, నంజుం డప్ప, సత్యనారాయణ, కృష్ణమూర్తి, ఎంపీటీసీ లీలావతి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, నాగభూషణ, మారుతి, వడ్డెర శ్రీనివాసులు ఉన్నారు.

వైసిపి పాలనలో బడుగులకు రక్షణ కరువు

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సునీల్ కుమార్

ప్రజాశక్తి-మడకశిర

బడుగులను బలి తీసుకోవడమే సామాజిక న్యాయమా అని సిఎం జగన్‌ను నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ ప్రశ్నించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ పాలనలో బడుగు, బలహీన వర్గాల ఆస్తులకు రక్షణ లేదన్న విషయం చేనేత కుటుంబం మరణంతో మరోసారి రుజువైందన్నారు. సిఎం జగన్ సొంత జిల్లా కడపలో వైసిపి నేతల భూకబ్జాల కు ఓ చేనేత కుటుంబం ఆత్మహత్యకు పాల్పడడంపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. మీ సొంత జిల్లాలోనే పేదల భూములు లాగేసుకుంటు న్నారంటే ఇక రాష్ట్రంలో పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చున్నారు. కొన్నిరోజుల క్రితం అదే కడప జిల్లాలో వందనం సుబ్బయ్య అనే పద్మశాలి నేతను అత్యంత దారుణంగా చంపేశారని, నేటికీ నిందితులపై చర్యలు లేవన్నారు. వచ్చే ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాలు వైసిపికి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఇకనైనా బిసిలపై దమనకాండ ఆపి నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి అధికారంలోకి వస్తే బిసిల కోసం ప్రత్యేకంగా చట్టం తెస్తారన్నారు. సమావేశంలో ఆదినారాయణ, కెఎన్ పల్లి సురేష్, రాజగోపాల్, కిష్టప్ప, టిడి పల్లి మంజునాథ్, అచ్చంపల్లి రమేష్, నాగరాజు, కోట్ల రంగనాథ్, మారుతి పాల్గొన్నారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం, టూ టౌన్ సిఐ అశోక్‌కుమార్

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రౌడీషీటర్లు ఎవరైనా చిన్నపాటి గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని వన్, టౌ టౌన్ సిఐలు సుబ్రహ్మణ్యం, అశోక్‌కుమార్ హెచ్చరించారు. ఆయా స్టేషన్లలో ఆదివారం సిఐలు రౌడీషీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రౌడీషీటర్లు ఎక్కడైనా, ఏ ప్రాంతంలోనైనా గొడవలు పడినా, గొడవలు సృష్టించేందుకు కారకులైనా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ఎవరూ గొడవలకు పాల్పడరాదని సూచించారు. పట్టణంలోని టీ కేఫ్‌లు, డాబాలు, హోటళ్లలో గుంపులు, గుంపులుగా ఉండటం వల్ల రాజకీయంగా గొడవలు జరిగే ప్రమాదం ఉందని, కావున ఎక్కువ మంది కూర్చోకుండా చూసుకోవాలని యజమానులను ఆదేశించారు.

సత్యసాయి భక్తుల గిరిప్రదక్షిణ


సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ప్రతి పౌర్ణమికి ముందు రోజు నిర్వహించే గిరి ప్రదర్శన కార్యక్రమం ఆదివారం సత్యసాయి భక్తులు పుట్టపర్తిలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక రథంలో సత్యసాయి బాబా చిత్రపటాన్ని ఉంచి ప్రశాంతి నిలయం గణేష్ గేట్ వద్ద నుంచి గోకులం మీదుగా ఎనుములపల్లి గణేష్ సర్కిల్, జానకి రామయ్య పెట్రోల్ బంక్, పెద్దకమ్మవారిపల్లి చింతతోపు, వేణుగోపాల స్వామి వీధి మీదుగా తిరిగి గణేష్ గేట్ వద్దకు ఊరేగించారు. ఊరేగింపులో దేశ విదేశీ భక్తులు భక్తి గీతాలు ఆలపిస్తూ భజన చేస్తూ పాల్గొన్నారు.

హోలీ సందర్భంగా బీహార్ భక్తుల పర్తియాత్ర

హోలీ సందర్భంగా బీహార్‌కు చెందిన సాయి భక్తులు పుట్టపర్తికి పర్తి యాత్రగా వచ్చారు. వారు ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలులో ప్రత్యేక నాటికలు, భజనలు ప్రదర్శించారు. అనంతరం సత్యమ్మ గుడి వద్ద నుంచి గణేష్ గేట్ వరకు వివిధ వేషధారణలో ర్యాలీ నిర్వహించారు. యాత్రలో 1000 మంది పాల్గొన్నట్లు వారు తెలిపారు.

గోవాలో సత్యసాయి మందిరం నిర్మాణం

పుట్టపర్తి అర్బన్ : గోవాలో సత్యసాయి మందిరం నిర్మాణానికి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్, ట్రస్ట్ సభ్యులు భూమిపూజ చేశారు. ఆదివారం గోవాలోని కర్మాలిలో సత్యసాయి సేవా సమితి సభ్యులు నితీష్ పాండేతో కలిసి రత్నాకర్ భూమిపూజ చేశారు. రత్నాకర్ మాట్లాడుతూ బాబా భక్తుల కోరిక మేరకు సత్యసాయి భజన మందిరం ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే అత్యంత సుందరంగా భవన నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు.

రామ్‌చరణ్ అభిమానుల 'మెగా' రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కదిరి టౌన్

మెగాస్టార్ చిరంజీవి తనయుడు, గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ పుట్టిన రోజు వారోత్సవాల్లో భాగంగా అఖిల భారత చిరంజీవి యువత, రాష్ట్ర రామ్ చరణ్ యువశక్తి, రామ్ చరణ్ యువ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో ఆదవారం స్థానిక ఏరియా హాస్పిటల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో అభిమానులు నారాయణస్వామి, చంద్రమోహన్, బావాజీ, మురళి, శివ కుమార్, ప్రదీప్, వెంక టేష్, మనోహర్, లక్ష్మణ, రాజేంద్ర, కార్తీక్, హరీష్, వాల్మీకి, దేవలం కార్తీక్, మునిగోపాల్, పవన్‌కళ్యాణ్, అనిల్, మధుసూతన్, సాయికుమార్, తదితరులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అఖిల భారత చిరం జీవి యువత అధ్యక్షులు లక్ష్మణ కుటాల, రామ్‌చరణ్ యువ ఫౌండేషన్ అధ్యక్షులు మనోహర్ మాట్లా డుతూ చిరంజీవి సమాజం కోసం మంచి చేయాలనే తపనతో బ్లడ్, ఐ బ్యాంక్ స్థాపించి సేవ చేస్తున్నారన్నారు. అదే సేవాస్ఫూర్తితో రామ్‌చరణ్ సమాజ సేవా కార్యక్ర మాల్లో అభిమానులను సమాయత్తం చేస్తున్నారన్నారు.


శిబిరంలో రక్తదానం చేస్తున్న రామ్‌చరణ్ అభిమానులు

కూటమిదే అధికారం

హిందూపురం ఎంపి అభ్యర్థి బికె.పార్థసారథి


భారీ ర్యాలీగా వెళ్తున్న బికె.పార్థసారథి

ప్రజాశక్తి -పెనుకొండ

అధికారం (టీడీపీ, జనసేన, బీజేపీ) కూటమిదేనని హిందూపురం ఎంపి అభ్యర్థి బికె.పార్థసారథి ధీమా వ్యక్తం చేశారు. ఎంపి అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత మొదటిసారి ఆదివారం పెనుకొండకు వచ్చిన బికెకి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ముందుగా స్థానిక వై జంక్షన్ నుంచి టీడీపీ కార్యాలయం వరకూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు అభినందనలు తెలిపారు. వారిని ఉద్దేశించి బికె మాట్లాడుతూ అధినేత చంద్రబాబు తనను అసెంబ్లీకి కాకుండా పార్లమెంట్‌కు పోటీ చేయమని ఆదేశించారన్నారు. నియోజక వర్గ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. అండగా నిలిచిన ఏ ఒక్కరినీ మరువనని తెలిపారు. రాష్ట్రం, యువత, అందరి భవిష్యత్తు కోసం అనుభవం ఉన్న చంద్రబాబు సిఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అందరినీ కలుపుకొని అన్ని స్థానాల్లో అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు సిద్దలింగప్ప, సోమశేఖర్, నరహరి, రవిశంకర్, నాయకులు కురుబ కృష్ణమూర్తి, చిన్నవెంకటరాముడు, కేశవయ్య, రొద్దం నరసింహులు, చిన్నప్పయ్య, అశ్వర్థరెడ్డి, నాగరాజు, హుజూర్, అనిల్, బాలునాయక్, శ్రీనివాసులు, నాగమణి, గాయిత్రి, బేబీ, అనసూయమ్మ, అనురాధ, తులసి పాల్గొన్నారు.

ఎపి భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యం : పల్లె


టిడిపిలో చేరిన వారితో పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

భావితరాల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలంటే చంద్రబాబును ఎపి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. పల్లె ఆదివారం మండలంలోని సున్నంపల్లి, అల్లాపల్లి పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా పల్లె రఘునాథ్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్ సమక్షంలో 101 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. సున్నంపల్లి గ్రామంలో 71, దాదిరెడ్డిపల్లిలో 26, కురుమాలలో 5, గొల్లపల్లిలో 4 కుటుంబాలు చేరగా వారికి పల్లె టిడిపి కండువా వేసి సాదరంగా స్వాగతం పలికారు. పల్లె మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యం అన్నారు. అనంతరం ఆయన స్థానిక టిడిపి, జనసేన, బిజెపి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి వేయించి టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, నాయకులు మేకల ఈశ్వర్, పిట్టా ఓబుల్‌రెడ్డి, సర్పంచి దారా లక్ష్మీదేవమ్మ, నాగేంద్ర, శంకర్‌రెడ్డి, ఎంపిటిసి శ్రీనివాసులు, రాజారెడ్డి, రంగారెడ్డి, అంజనప్ప, తుమ్మల మహబూబ్ బాషా, సుధాకర్, ఓబుల్‌రెడ్డి, నాగరాజు, నారపరెడ్డి, నిజాం, చంద్ర, నాగరాజు, రంగారెడ్డి, జనసేన నేత అబ్దుల్లా, కేశవరెడ్డి, శంకర్, ప్రేమానందరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, రమణారెడ్డి, వలిపి సోమశేఖర్, కంచి సురేష్, సుధాకర్‌రెడ్డి, గంటా శ్రీనివాస్, హనుమంతురెడ్డి, కృష్ణమూర్తి, మీ సేవ సుధాకర్, వై.శివారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారికి అండగా ఉంటాం : పల్లె

పుట్టపర్తి అర్బన్ : టిడిపిపై నమ్మకంతో పార్టీలోకి వస్తున్న వారికి అన్ని విధాలా అండగా ఉంటామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పల్లె స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొందరు వైసిపి నాయకులు జగన్ అరాచక పాలన నచ్చక, మరికొందరు టిడిపి విధానలు నచ్చి పార్టీలో చేరుతున్నారన్నారు. పల్లె సింధూర రెడ్డి ప్రచారానికి విశేష స్పందన వస్తోందని అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

పరిటాల సునీత సమక్షంలో టిడిపిలో పలువురు చేరిక


పరిటాల సునీత సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

చెన్నేకొత్తపల్లి : మండలంలోని వెంకటంపల్లి, ఆమిదాలకుంట, చెన్నేకొత్తపల్లి గ్రామాలకు చెందిన 18 వైసిపి కుటుంబాలు రామగిరి మండలంలోని వెంకటాపురంలో పరిటాల సునీత సమక్షంలో టిడిపిలో చేరారు. వెంకటంపల్లి గ్రామం నుంచి చిన్న ముత్యాలరెడ్డి, సి.మోహన్‌రెడ్డి, హెచ్.రామాంజనే యులు, జి.నాగరాజు, బి.సుబ్బరాయుడు, బి.ముత్యాలమ్మ, ఎస్.మూర్తి, ఎస్.చెన్నమ్మ, జి.శ్రీనివాసులు, ఎస్.నరేష్, సి.సుబ్బారెడ్డి, జి.లింగమయ్య, సి.వెంకట్రామిరెడ్డి, ఆమిదాలకుంట గ్రామం నుంచి శ్రీనివాసరెడ్డి, బాలకృష్ణారెడ్డి, చెన్నేకొత్తపల్లి గ్రామం నుంచి కాన మద్దిలేటి, శ్రీరాములు, కాన సుబ్బరాయుడు టిడిపిలో చేరారు.


గరుడ వాహనంపై దర్శనమిస్తున్న శ్రీవారు

గరుడ వాహనంపై శ్రీవారి దర్శనం

కదిరి అర్బన్ : పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారిఉ గరుడ వాహనంలో ఊరేగుతూ భక్తులతో దర్శనమిచ్చారు. బ్రహ్మ గరుడ వాహనంపై స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. తూర్పు గోపురం కింద హారతిని భక్తులు దర్శించుకున్నారని ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

తాగునీటి కోసం ఆందోళన

ఓబుళదేవరచెరువు : మండలంలోని కొండకమర్ల పంచాయతీ దిగువ గంగిరెడ్డిపల్లి గ్రామంలో తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. వారికి స్థానిక జనసేన పార్టీ నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. నెలరోజులుగా గ్రామస్తులు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు పంచాయతీ సెక్రటరీ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచి అల్లాపల్లి శ్రావణి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. నియోజవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్ పంచాయతీ కార్యదర్శికి సమస్యను వివరించగా రెండు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొండబోయన సతీష్, ఈశ్వర్, టిడిపి నాయకులు జయచంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తలనీలాల ద్వారా రూ. 1.54 కోట్ల ఆదాయం

కదిరి టౌన్ : పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తలనీలాలు పోగు చేసుకొనే హక్కు కోసం సీల్డ్ టెండర్ల ద్వారా వేలం పాట నిర్వహించారు. ఆదివారం టెండర్ బాక్స్ తెరవగా ఇద్దరు టెండరు షెడ్యూల్స్ దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. అందులో కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన కెవిఎన్.ఎంటర్‌ప్రైజెస్ వారు రూ. 1,53,99,999 అత్యధిక మొత్తానికి హక్కును దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ వెండిదండి శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మక్బూల్

కదిరి టౌన్ : పట్టణంలోని 11వ వార్డ్‌లో ఉన్న మసీదులో ఆదివారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్ మక్బూల్ పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలు సాయంత్రం 6.30 గంటలకు దీక్ష విరమించారు. అనంతరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సాధిక్‌బాషా, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న మక్బూల్‌అహ్మద్

టిబి రహిత సమాజ స్థాపనే ధ్యేయం : డిఎంహెచ్‌ఒ


సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

2025 నాటికి టిబి రహిత సమాజం స్థాపించడమే ధ్యేయమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో క్షయ వ్యాధిపై ర్యాలీ, సమావేశం నిర్వహించారు. డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య 2025 నాటికి టిబిని అంతం చేస్తామని తెలిపిందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం జ్వరం రావడం, ఆకలి మందగించడం, బరువు తగ్గిపోవడం లక్షణాలు కనిపిస్తే సమీప ప్రభుత్వాసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి వై జంక్షన్ వరకూ ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ కృష్ణయ్య, డిఎల్ఎటి డాక్టర్ తిప్పయ్య, ఎంపిడిఒ నాగేశ్వర్‌రెడ్డి, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీకుమారి, సిహెచ్‌ఒ నగేష్, ఎంపిహెచ్ఎస్ రామ్మోహన్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో టిబి నివారణపై స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సూపర్వైజర్లు కిష్టప్ప, ఎరుకలప్ప, చంద్రకళ, ల్యాబ్ టెక్నీషియన్ జయమ్మ, బాలాజీనాయక్, స్టాఫ్ నర్సులు, ఆర్డీటీ విద్యార్థినులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మహేశ్వరి మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహించారు.

ఓబుళదేవరచెరువు : 'క్షయ రహిత భారత్' లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం, సహాయ, సహకారాలు చాలా అవసరమని వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో క్షయ వ్యాధి నివారణపై అవగాహ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కమల్‌రోహిత్, సిబ్బంది శుభాషిణి, దిల్షాద్, విజయకుమారి, వరలక్ష్మి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'మన పంతం.. టిబి అంతం'

హిందూపురం : 'మన పంతం.. టిబి అంతం' అని జిల్లా ఆసుపత్రిలోని టిబి యూనిట్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పురష్కరించుకుని పట్టణంలో టిబిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బ్యానరు, ప్ల కార్డులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిబి యూనిట్ సూపర్‌వైజర్ గౌస్‌పీర్, ల్యాబ్ సూపర్‌వైజర్ రవికుమార్‌రెడ్డి, నాగమణి, పవిత్ర, తనూజ, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆశాలు పాల్గొన్నారు.

చేనేత కుటుంబం ఆత్మహత్య బాధాకరం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కడప జిల్లాలో చేనేత కుటుంబం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని టిడిపి తొగటవీర క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశే సుధాకర్, ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ, జిల్లా అధ్యక్షుడు పోలా లక్ష్మీనారాయణ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కుటుంబం ఆత్మహత్యకు కారకులైన రెవెన్యూ అధికారులను కఠినంగా శిక్షించాలని, ఆ కుటుంబానికి రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని వారి వారసులకు అప్పగించాలని, లేని పక్షంలో చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

సోషల్ మీడియా నిబంధనలు పాటించాలి : సిఐ

కదిరి అర్బన్ : సోషల్ మీడియా విధిగా నిబంధనలు పాటించాలని సిఐ ఆదేశించారు. వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించి సోషల్ మీడియాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యక్తులకు ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తులను రెచ్చగొట్టేలా, ఉద్దేశపూర్వకంగా వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశానికి వైసీపీ తరపున ముబారక్, టిడిపి సోషల్ మీడియా సభ్యులు హాజరయ్యారు.

రైతు విరాళం

పెనుకొండ : మండలంలోని చిన్నపరెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల దాతల సహకారంతో ఆంజనేయస్వామి ఆలయం నిర్మించి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి ముఖ ద్వారం నిర్మించేందుకు ఆదివారం రైతు వీరజిన్నప్ప రూ. 2.5 లక్షల విరాళం ప్రకటించాడు. దీంతో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, వైసిపి లీగల్ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, న్యాయవాది డి.నాగరాజు ఆధ్వర్యంలో వీరజిన్నప్పను సన్మానించారు. కార్యక్రమంలో రాము, అమర్, నాగేంద్ర, వెంకటేష్ గౌడ్, రామాంజనేయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'సత్యన్న సేన' చేయూత

నల్లచెరువు : మండలంలోని ఉబిచెర్ల గ్రామానికి చెందిన డి.రెడ్డెప్ప కుటుంబం గత నెలలో తమ కుమార్తె వివాహానికి వెళ్లగా ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలి నూతనంగా నిర్మించుకున్న ఇల్లు నేల మట్టమైన విషయం విదితమే. రెడ్డెప్ప ఇల్లు కట్టుకోవడానికి ఆదివారం కొక్కంటి క్రాస్‌కు చెందిన సత్యన్న సేన సభ్యులు ట్రాక్టర్ సిమెంట్ ఇటుకలు అందజేశారు. కార్యక్రమంలో సత్యన్న సేన సభ్యులు సద్దగుంట్ల విశ్వనాథ్, జయచంద్ర, ద్వారకనాథ్ కొండ, బాగేపల్లి అశోక్, గోవిందు, బాలకృష్ణ, బక్కసం నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యార్థిని ఆత్మహత్య

బత్తలపల్లి : అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థిని ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసు కొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలోని కోడేకండ్ల గ్రామంలో చోటు చేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కోడేకండ్ల గ్రామానికి చెందిన ఏకిల చెన్నకేశవనాయుడు, భాగ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు సంతానం. తండ్రి దుకాణం నడుపుకుం టూ, తల్లి వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పెద్ద కుమార్తె లిల్లీ అలియాస్ పూర్ణవర్ధిని(17) మదనపల్లి సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఈ చదువుతోంది. 4 నెలలుగా చెస్ట్‌పెయిన్‌తో బాధపడుతోంది. అనారోగ్యంతో ఇంటికి వచ్చిన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. ఇంటికి వచ్చిన సోదరుడు గమ నించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సహకారంతో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కర్నాటకలో ఆంధ్ర వాసి హత్య

చిలమత్తూరు : కర్నాటకలోని బాగేపల్లిలో ఆదివారం తెల్లవారు జామున మండలంలోని దేమకేతేపల్లికి చెందిన దాసరి వెంకటేశప్పను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా గొంతు కోసి హతమార్చారు. దీనిపై బాగేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ఆర్టీసీ బస్సు బోల్తా.. ఐదుగురికి గాయాలు

చిలమత్తూరు : మండలంలోని కోడూరు తోపు వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ సహా నలుగురు గాయపడ్డారు. వివరాలు.. బెంగళూరు వైపు నుంచి అనంతపురం మీదుగా తాడిపత్రికి వెళ్లే ఆర్టీసీ బస్సు 44వ జాతీయ రహదారిలో కోడూరు తోపు కనిశెట్టిపల్లి క్రాస్ వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ఆ సమయంలో బస్సులో 25 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో వి.లక్ష్మిదేవి, అజయ్(బుక్కరాయసముద్రం), కళావతి(ధర్మపురి), లక్ష్మినారాయణమ్మ(తాడిపత్రి)లకు స్వల్పంగా గాయా లు కాగా డ్రైవర్ మోహన్‌కి మూగదెబ్బలు తగిలాయి. వీరిని అంబులెన్స్ సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎవరికీ ప్రాణపాయం లేకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి విచారణ చేపట్టారు.

పేకాట స్థావరంపై దాడులు

హిందూపురం : రూరల్ మండలంలోని మలగూరు వద్ద పేకాట స్థావరంపై ఆదివారం జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. 18 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 68,300 నగదు, 13 బైక్‌లు స్వాధీనం చేసుకుని రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్‌లో అప్పగించారు. వారిపై కేసును నమోదు చేసినట్లు అప్ గ్రేడ్ సిఐ శ్రీనివాసులు తెలిపారు. కాగా పేకాట జూదరుల వద్ద ఉన్న సెల్‌ఫోన్లను ఎందుకు స్వాధీనం చేసుకోలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అరెస్టు చేసిన వారిలో అధికార పార్టీకి నాయకులను తప్పించినట్లు, పెద్దమొత్తంలో నగదు పట్టుబడ్డా తక్కువ చూపినట్లు ఆరోపణలు వినపిస్తున్నాయి.

లేపాక్షి : మండలంలోని కుర్లపల్లి గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై దాడులు చేసి ఏడుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 13,300, 3 బైక్‌లు, ఓ కారు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాల గురించి తెలిస్తే ప్రజలు సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకొంటామని తెలిపారు. మండలంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.